
# డాక్టర్‌కి లైఫ్ వచ్చింది!




**భమిడిపాటి సోమయాజి**

కైలాష్ అతని తల్లిదండ్రులకి ఏకైక సంతానం. బాగా ఐశ్వర్యవంతులు కనుక అతన్ని డొనేషన్ కట్టి మెడిసిన్ చదివించారు. డాక్టరయ్యాడు. గవర్నమెంట్ ఉద్యోగంలో చేరితే ఆ ఉద్యోగం పోవడం ఖాయమని, తరగని ఐశ్వర్యవంతులం కదా అని డాక్టర్ కైలాష్ చేత ఓ అయిదు పడకలు గల నర్సింగ్ హోమ్ పెట్టించారు అతని తండ్రిగారు.

కేసులేం రావడం లేదు. అయినా డాక్టర్ భయపడలేదు. తర్వాత తర్వాత ఇతని సత్తా తెలియని వాళ్లు వైద్యానికి వచ్చేవారు. ఆ వచ్చిన రోగుల్ని వదలకుండా, పడకలు కేటాయించి వాళ్లతో చీట్లపేక ఆడేవాడు. ఈ పేకాట సౌలభ్యం తెలుసుకున్న కొంతమంది తినేసి అక్కడే పేక ఆడుకోవచ్చని ఆ నర్సింగ్ హోమ్‌లో చేరేవారు. కొంతమంది ఇంట్లో ఈ రోగులు పెట్టే బాధ పడలేక, డబ్బు పోతే పోయిందని తమ వాళ్లని ఈ నర్సింగ్ హోమ్‌లో చేర్చేవారు. ఇలా చేరిన వాళ్ల చేత కొంత డబ్బు ముందుగానే డిపాజిట్ చేయించి, ఆ డబ్బులో, కౌంట్లు మిడిల్ డ్రాప్స్ లెక్క ప్రకారం మినహాయించేవారు డాక్టర్ కైలాష్.

కొత్తగా వచ్చిన రోగులకి పేకాట రాకపోతే నిరుత్సాహపడకుండా వాళ్లని ఉత్తేజపరచి, పేకాట విధానం నేర్పి, శాయశక్తులా కష్టపడి పేకాటలో తనంతటి వార్ని చేసేవారు డాక్టర్ గారు.

ఓ రోజు డాక్టర్‌గారు కులాసాగా వాళ్లతో పేకాట ఆడే సమయంలో, నర్స్ వచ్చి "ఎవరికో కడుపులో పోట్లు తన్నుకు వస్తున్నాయ్, ఓసారి వచ్చి రోగిని పరీక్ష చెయ్యండి" అంది.

"పోట్లు వస్తే నన్నేం చెయ్యమంటావ్. వాడికి కడుపులో పోట్లు తన్నుకు వచ్చినట్లు, నాకు పేక ముక్కలు తన్నుకు వస్తే బాగుండేది. ఈ రోజు ఇప్పటివరకూ నలభై కౌంట్లు ఇచ్చాను. ఈ ఆటలు కూడా ఇప్పటి వరకూ 'లైఫ్ కార్డ్' రాలేదు" అని విసుక్కున్నారు డాక్టర్.

"అదికాదు సార్! ఆ వచ్చిన రోగి కూడా అస్మదీయుడే! పేకాటలో వచ్చిన నష్టం వలననే అతనికి కడుపులో పోట్లు వచ్చాయట!" అంది నర్స్.

"అతను అస్మదీయుడన్నమాట ముందు చెప్పవేం. వస్తున్నాను పద!"

పేషెంట్‌ని పరీక్ష చేస్తూ "ఈ కడుపులో పోట్లు తరచుగా వస్తున్నాయా!" అని అడిగారు డాక్టర్.

"ఎప్పుడూ రావండి. పేకాటలో ఓ రెండువేల పైన పోయినప్పుడే వస్తాయ్!" అన్నాడు, పేషెంట్.

"నో..నో! రెండు వేలు పోతేనే కడుపులో పోట్లా! ఎప్పుడూ పేకాటలో పోయిన డబ్బు మనది కాదనే పేక జ్ఞానం సంపాదించుకోవాలి. మనది కానిది ఏదైనా సరే పోతూంటుంది. దానితో పాటు మనమూ పోతామా!" అని పేషెంట్‌కి జ్ఞానబోధ చేస్తూ, "నర్స్ ఇతనికి అయిదో నెంబర్ పడక ఏర్పాటు చేసి ఓ స్లీపింగ్ డోస్ ఇచ్చెయ్! పొద్దున్న లేస్తే చూద్దాం!" అన్నారు డాక్టర్.

"సార్! ఆ అయిదో నెంబరు పడక ఖాళీ లేదు"

"అతను కట్టిన డిపాజిట్ అయిపోయింది. ఇక అతను డబ్బు కట్టలేదు, ఇక అతన్ని పంపించెయ్" అని మెల్లిగా చెపుతూ, "ఎవర్ని, ఎప్పుడు ఎక్కడికి పంపాలో తెలియని ఓ వెర్రిదానివి నువ్వు!" అని ఓ చిరునవ్వు నవ్వాడు డాక్టర్.

నర్స్ కూడా నవ్వింది. లేకపోతే తన ఉద్యోగం ఎక్కడకైనా పోతుందేమోనని.

"ఇదంతా భూతల స్వర్గంలా ఉంది అంతా నవ్వుల మయం!" అని ఆ వచ్చిన 'కడుపులో పోట్లతను' కూడా ఓ వెర్రి నవ్వు నవ్వాడు.

రోగి నవ్వినప్పుడు, తాము నవ్వకపోతే బాగుండదని, అతన్ని తీసుకొచ్చిన వాళ్లు కూడా నవ్వారు.

అబ్బో! అక్కడ నవ్వులే నవ్వులు.

ooo

ఆ మర్నాడు భగవంతుని దయ వలన కడుపులో పోట్లు తగ్గి అతను కుదుటపడ్డాడు. పేకాట అలవాటున్నవాడు ఆరోగ్యం కొంచెం చక్కపడితే ఆడతాడు కదా! అలాగే ఇతను కూడా పేకాట మొదలెట్టేశాడు.

ఈ కొత్తగా వచ్చినతనికి రెండు వేల పైన పోతే కడుపులో పోట్లు వచ్చి లుంగ చుట్టుకుపోతాడనీ, రెండు వేల లోపునే అతని దగ్గర డబ్బులు కొట్టుకోమని డాక్టర్‌గారు మిగిలిన వారికి ఉప్పందించారు.

డాక్టర్ గారి మాటంటే అందరికీ గౌరవమే. ఆయన చెప్పినట్లు చేసేవారు. పైగా ఆయన చెప్పినట్లు చెయ్యకపోతే, పేకాటలో కావల్సిన ముక్క వెయ్యక చంపేస్తారు. బయట సరైన వైద్యం చెయ్యకుండా చంపేస్తారు. మొత్తంమీద డాక్టర్ గారి చేతిలో ఓసారి పడితే మాత్రం, చావు ఖాయం!

ఓ రెండు గంటల తర్వాత, నర్స్ హఠాత్తుగా పరిగెత్తుకుంటూ వచ్చి, "మూడో బెడ్ నెంబర్ పేషెంట్‌ని వాళ్లవాళ్లు చూడ్డానికి వచ్చారు, డాక్టర్!" అని చెప్పింది.

"ఆట మధ్యలో ఎలా చూపిస్తాం వెళ్లి, అతను



'కామాలోకి' వెళ్లాడని చెప్పు" అన్నారు డాక్టర్.

"కామా కాదు డాక్టర్ కోమా" అంది నర్స్.

"కోమాయో వల్లకాడో! పోనీ కోమా అనే చెప్పవమ్మా! అసలే నా ఆటకి 'లైఫ్' లేక ఛస్తున్నాను" అని అరిచారు డాక్టర్.

వెళ్లిన నర్స్ తిరిగి వచ్చి, "కోమాలోంచి తెలివిలోకి ఎప్పుడు వస్తారు అని అడుగుతున్నారు డాక్టర్", అంది.

"ఇదేం తీర్థయాత్రలా ఎప్పుడు వస్తారో చెప్పడానికి! కోమా అయిపోయిన తర్వాత వస్తాడని చెప్పు" అన్నారు డాక్టర్.

ఓ గంట తర్వాత హడావిడిగా వచ్చిన నర్స్‌ని చూసి "ఏమిటి విషయం!" అన్నారు డాక్టర్.

"రెండో నెంబర్ బెడ్‌కి సంబంధించిన పేషెంట్‌ని వాళ్ల చుట్టాలు చూడాలంటున్నారు డాక్టర్"

పేకాటలో మునిగిపోయిన డాక్టర్, "మూడో నెంబర్ బెడ్ మీదతను కోమాలోకి వెళుతూంటే, ఆ రెండో బెడ్ అతన్ని, 'కంపెనీ సేక్' అతనితో తోడు పంపించాం అని చెప్పు!" అన్నారు.

"ఎప్పుడొస్తాడని అడిగితే!" అంది నర్స్.

"వస్తే వస్తాడు పోతే పోతాడు అని చెప్పు. పదే పదే రాకు. నాకు లైఫ్ కార్డు లేక చాలా చికాగ్గా ఉంది!"

ఆ నర్స్ చెప్పింది విని "ఒకేసారి ఇద్దరేసి చట్టాపట్టాలు వేసుకుని కోమాలోకి పోవడం మేమెక్కడా వినలేదు, చూడలేదు కాలవైపరీత్యం" అంటూ విస్తుపోయారు ఆ పేషెంట్ తాలూకు బంధువులు.

ఇంతలో డాక్టర్ గారు "లైఫ్ వచ్చింది" అని ఓ పొలికేక పెట్టారు.

ఆ కేక విన్న బంధువులు, "హమ్మయ్య! మన వాళ్లు ఎలాగైతేనేం, ఆ కోమాలోంచి బయటపడ్డారన్నమాట!" అనుకున్నారు.